

మొక్కలతో ప్రకృతికి రక్ష

◆ కలెక్టర్ టిఎస్.చేతన్, ఎమ్మెల్యే సింధూరరెడ్డి
◆ జిల్లా వ్యాప్తంగా మొక్కలు నాటే కార్యక్రమం



మొక్కలు నాటి నీళ్లు పోస్తున్న ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, కలెక్టర్ చేతన్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్


విరివిగా మొక్కలు నాటడంతో ద్వారా పర్యావరణం సమతుల్యంగా ఉండి ప్రకృతి, ప్రజలకు రక్షణ ఇస్తుందని కలెక్టర్ టిఎస్.చేతన్ తెలిపారు. పుట్టపర్తి పరిధిలోని ప్రశాంతి నిలయం వెనుక వైపున ఉన్న ఎద్దులకొండలో జిల్లా అటవీ శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డితో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మొక్కలు నాటడం, వాటిని పరిరక్షించడంలో ప్రజలు, స్థానిక స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యం అవసరం అన్నారు. వనం-మనం కార్యక్రమంలో భాగంగా జిల్లాలో నాలుగు లక్షల మొక్కలు నాటేలా లక్ష్యాన్ని నిర్ధేశించుకున్నామన్నారు. కాలుష్యం లేకుండా ఉండేందుకు ప్రజలు విరివిగా మొక్కలు నాటాలన్నారు. ఎమ్మెల్యే సింధూరరెడ్డి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. అందులో భాగంగా పుట్టపర్తిలో విరివిగా మొక్కలు నాటనున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిఎఫ్ఒ చక్రపాణి, పుట్టపర్తి ఆర్డీవో సువర్ణ, వ్యవసాయ శాఖ జెడిఎ సుబ్బారావు, ఉద్యానవన శాఖ చంద్రశేఖర్, పశుసంవర్ధక శాఖ సుభదాసుతో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పెనుకొండ : భావి తరాలకు మనం అందించాల్సిన వారసత్వ సంపద పర్యావరణం అని మంత్రి సవిత అన్నారు. గురువారం అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలో మొక్కలు నాటి ప్రజానీకంతో పర్యావరణ పరిరక్షణ కోసం మంత్రి ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రకృతి అంటే ఏ ఒక్కరి సొత్తూ కాదని పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి పైనా ఉందని న్నారు. 2047 కు రాష్ట్రంలో పచ్చదనం పరిశుభ్రత 50 శాతం ఉండాలన్నారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని గాలికి వదిలేసిందని గతంలో జగన్మోహన్ రెడ్డి విమానంలో వెళ్తే కింద చెట్లు కొట్టేసేవారని మంత్రి సవితమ్మ అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో ఆనందరావు గారు మున్సిపల్ కమిషనర్ సతీష్ గారు ఫారెస్ట్ అధికారులు ఎంపీడీవో ఇతర అధికారులు,కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.




పెనుకొండలో మొక్క నాటుతున్న మంత్రి సవిత

తమ్ముళ్ల కోల్డ్ వార్..!



◆ టిడిపి నాయకుడు సుధాకర్ హత్యకు కుట్ర?
◆ ఎస్పీకి ఫిర్యాదు.. రహస్య విచారణ
◆ అధిష్టానం నుంచి నేతలకు పిలుపు



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ నేతల మధ్య వర్గ పోరు తారాస్థాయికి చేరుకుంది. ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ అనుచరులు, తెలుగుదేశం పార్టీ నాయకులు సుధాకర్ నాయుడు మధ్య విభేదాలు రోజురోజుకి ముదురుతున్నాయి. 2024 ఎన్నికల్లో టిడిపి నేత సుధాకర్ నాయుడు ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ గెలుపు కోసం కషి చేశారు. మొదట్లో అంతా సవ్యంగానే సాగుతున్నప్పటికీ గత కొంతకాలంగా అర్బన్ నియోజకవర్గంలో ఎమ్మెల్యేపై వ్యతిరేకత వస్తుందని సుధాకర్ నాయుడు ఎమ్మెల్యే అనుచరులతో చెప్పడంతో వివాదం మొదలైంది.

సుధాకర్ నాయుడు హత్యకు కుట్ర.?

తెలుగుదేశం పార్టీ నాయకుడు సుధాకర్ నాయుడు తనకు ఎమ్మెల్యే అనుచరులతో ప్రాణహాని ఉందని అనంతపురం జిల్లా ఎస్పీ జగదీష్‌కు ఇటీవల ఫిర్యాదు చేశారు. ఇద్దరు అధికార పార్టీ నేతలు కావడంతో ఎస్పీ జగదీష్ అత్యంత గోప్యంగా దీనిపై విచారణ చేపట్టారు. అనంతపురం అర్బన్ నియోజకవర్గంలోని నేతల మధ్య వివాదాన్ని ఉన్నత స్థాయి అధికారులకు నివేదిక సమర్పించారు. ఎమ్మెల్యే అనుచరులు సుధాకర్ నాయుడుని చంపేస్తామంటూ బెదిరించారని నివేదికలో పేర్కొన్నట్లు సమాచారం.

అధిష్టానం నుంచి నేతలకు పిలుపు

తమ్ముళ్ల మధ్య కోల్డ్ వార్, పోలీసుల కేసుల నేపథ్యంలో ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, సుధాకర్ నాయుడులను టిడిపి అధిష్టానం విజయవాడకు రావాలని పిలిచింది. అధిష్టానం పిలుపుతో అర్బన్ నియోజకవర్గంలో ఏం జరుగుతుందో అన్న ఉత్కంఠ నెలకొంది. నియోజకవర్గంలో ఎమ్మెల్యే అనుచరులు చేస్తున్న దందాలను గుర్తు చేసినందుకే తనను అంతం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని టిడిపి అధిష్టానానికి సుధాకర్ చెప్పినట్టు తెలుస్తోంది. ఇదే అంశంపై ఇద్దరు నేతలతో కూడా అధిష్టానం చర్చించినట్లు సమాచారం. ఈ వివాదానికి ఇంతటితో ఫుల్‌స్టాప్ పెట్టే బాధ్యతను టిడిపి సీనియర్ నేత కోవెలపూడి రవీంద్రకు అప్పగించారు.

అనంతపురంలో వర్గ పోరు

2024 ఎన్నికలో ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్‌కు అనూహ్యంగా టిడిపి టికెట్ దక్కింది. ఎన్నికల అనంతరం అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో వర్గపోరు మొదలైంది. 2024 ఎన్నికల్లో అనంతపురం అర్బన్ నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ సీటును మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి, ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్, సుధాకర్ నాయుడులు ఆశించారు. అధిష్టానం మాత్రం దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్‌కు కేటాయించింది. పార్టీ గెలుపు కోసం అందరూ కలిసికట్టుగా పని చేయాలని అధినేత పలమార్లు చెప్పడంతో ఆ ఎన్నికల్లో అందరూ కలిసికట్టుగా పనిచేసి పార్టీ విజయానికి కృషి చేశారు. అనంతరం జరిగిన పరిణామాలతో పార్టీకి కష్టపడిన వారిని ఎమ్మెల్యే అనుచరులు దూరం పెడుతున్నారని ఆరోపణలు వినిపించాయి. ఎమ్మెల్యేకు కార్యకర్తలకు నగరంలోని ప్రధాన నాయకులకు ఎమ్మెల్యే దగ్గరకు కూడా వెళ్లనివ్వకుండా అడ్డుపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్న పరిస్థితి అనంతపురంలో కనిపిస్తోంది.

పకడ్బందీగా డీఎస్సీ పరీక్ష నిర్వహణ

ఎలాంటి లోటుపాట్లు రానీయొద్దు : కలెక్టర్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్



పరీక్ష కేంద్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్ చేతన్

జిల్లాలో శుక్రవారం నుంచి ప్రారంభం అయ్యే మెగా డీఎస్సీ పరీక్షలను పటిష్టంగా నిర్వహించాలని కలెక్టర్ టిఎస్.చేతన్ పేర్కొన్నారు. పరీక్ష జరిగే పుట్టపర్తిలోని సంస్కృతి ఇంజినీరింగ్ కళాశాలను కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మెగా డీఎస్సీని కంప్యూటర్ బెస్డ్ టెస్ట్‌గా నిర్వహిస్తోందన్నారు. ఈనెల 6 నుంచి 30వ తేదీ వరకు ఉదయం 9:30 గంటల నుంచి 12:00, మధ్యాహ్నం 2:30 గంటల నుంచి 5:00 గంటల వరకు రెండు సెషన్స్‌గా పరీక్షలు జరుగుతాయని వివరించారు. పరీక్షల నిర్వహణ కోసం పోలీసు, రెవెన్యూ, విద్యుత్ శాఖ, వైద్య ఆరోగ్యశాఖ, విద్యాశాఖ సమన్వయంతో పని చేసి విజయవంతంగా నిర్వహించాలన్నారు. మెడికల్ క్యాంపు అందుబాటులో ఉండాలని, నిరంతరం విద్యుత్ సౌకర్యం ఉండాలని, తాగునీరు కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సూర్యనారాయణ రెడ్డి, పుట్టపర్తి ఆర్డీవో సువర్ణ, విద్యాశాఖ అధికారి క్రిష్టప్ప, తహశీల్దార్ కళ్యాణ చక్రవర్తి, ఎంఈవో ఖాదర్ వలీ పాల్గొన్నారు.

కొత్తచెరువు : ఈనెల 6 నుంచి 30వ తేదీ వరకు డీఎస్సీ పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని డీఈవో కిష్టప్ప తెలిపారు. ఉమ్మడి జిల్లాలో అనంతపురం పుట్టపర్తి బెంగళూరు లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. రోజుకు రెండు విడతలుగా పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఉదయం 9 నుండి 12 గంటల వరకు మధ్యాహ్నం 2: 30 నుండి సాయంత్రం 5:00 వరకు ప్రతిరోజు పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అనంతపురంలో ఐదు కేంద్రాలలో, తాడిపత్రిలో ఒక కేంద్రం, గుత్తిలో ఒక కేంద్రం, పుట్టపర్తిలో ఒక కేంద్రం, బెంగళూరులో రెండు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. మొత్తం పేపర్ల వారిగా కలిపి 45, 186 మంది అభ్యర్థులు పరీక్షలు రాయనున్నారని కేంద్రాల వద్దకు 1:30 ముందుగానే చేరుకోవాలన్నారు. వైద్య సేవల కోసం ఎఎన్ఎంలను ఏర్పాటు చేశామని అలాగే భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. పరీక్షా కేంద్రంలోకి సెల్ ఫోన్లు నిషేధించడం జరిగిందన్నారు. హాల్ టికెట్లు గుర్తింపు కార్డుతో హాజరు కావాలని కోరారు.

వెన్నుపోటుకు కేరాఫ్ వైఎస్. జగన్‌రెడ్డి

టిడిపి జిల్లా అధ్యక్షులు వడ్డే అంజినప్ప

ప్రజాశక్తి-హిందూపురం

వెన్నుపోటుకు పేటెంట్ వైసీపీ అని, అందుకు ప్రతిరూపం మాజీ ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి అని టిడిపి జిల్లా అధ్యక్షులు వడ్డే అంజినప్ప విమర్శించారు. గురువారం పట్టణంలోని ప్రెస్ క్లబ్ లో టిడిపి నాయకులు విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో టిడిపి జిల్లా అధ్యక్షులు వడ్డే అంజినప్ప, మున్సిపల్ చైర్మేన్ రమేష్ కుమార్, మాజీ మున్సిపల్ చైర్మేన్ అనిల్‌కుమార్ పాల్గొనిమాట్లాడారు. తన ఎదుగుదలకు కారణమైన కాంగ్రెస్ పార్టీని, తన భుజాన ఎత్తుకు పెంచిన బాబాయిని వెన్నుపోటు పొడిచి , ఆస్తికోసం తల్లి, చెల్లికి వెన్నుపోటు పొడిచిన ఘనుడు జగన్‌రెడ్డి అంటూ మండిపడ్డారు. ఏడాది ప్రజారంజకంగా పాలించిన కూటమి ప్రభుత్వంపై కక్ష సాధింపుకే బుధవారం వెన్నుపోటు దినంగా ప్రకటించిన జగన్‌రెడ్డి తన రాజకీయానికి సమాధికట్టి ఏడాదైన సందర్భంగా వైసీపీ వర్ధంతిని జరుపుకోవాల్సి ఉందన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర అభివృద్ధి కోసం కషి చేస్తున్న కూటమి ప్రభుత్వానికి సహకరించాలని హితవు పలికారు. ఈ సమావేశంలో రాష్ట్ర కురుబ కార్పోరేషన్ డైరెక్టర్ పరిమళ, రామాంజినమ్మ, శ్రీదేవి, అమర్నాథ్, వెంకటేష్, రాము తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో పాల్గొన్న నాయకులు

బక్రీద్‌ను ప్రశాంతంగా జరుపుకోండి

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

ప్రశాంతమైన వాతావరణంలో బక్రీద్ పండుగను జరుపుకోవాలని శ్రీ సత్య సాయి జిల్లా ఎస్పీ వి రత్న పేర్కొన్నారు. ఈ మేరకు జిల్లా వ్యాప్తంగా సంబంధిత పోలీస్ అధికారులు గురువారం పీస్ కమిటీలతోసమావేశాలు నిర్వహించారు.బక్రీద్ పండుగ సందర్భంగా ముస్లిం మత పెద్దలతో, పోలీసు అధికారులు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అన్ని సర్కిళ్ల పరిధిలో సిఐలు, ఎస్ఐలు, పీస్ కమిటీ ముస్లిం మత పెద్దలతో సమావేశాలు నిర్వహించారు. ఏవైనా ఇబ్బందులుంటే తెలుసుకుని పరిష్కరించాలనే ఉద్దేశ్యంతోనే ఈ సమావేశం నిర్వహించి వారితో అభిప్రాయాలను తెలుసుకున్నారు. జూన్ 7న బక్రీద్ పండుగను సంతోషంగా జరుపుకోవాలన్నారు. ఏ చిన్న సమస్య వచ్చినా వెంటనే పోలీస్ అధికారులకు తెలియజేయాలన్నారు.

ఇష్టారాజ్యంగా అనర్హులకు ఇళ్ల పట్టాలు

అధికారుల సహాయకులకు మంజూరు- నాలుగేళ్లుగా ఇదే తంతు- విచారిస్తే మరిన్ని వాస్తవాలు వెలుగులోకి



వడ్డించే వాడు మనవాడైతే చివరాఖరున కూర్చున్నా వచ్చే ఇబ్బందేమీ లేదు అన్న సామెతను నిజం చేస్తూ పుట్టపర్తి జిల్లా కేంద్రంలో కలెక్టరేట్, ఆర్డీవో, తహశీల్దార్ కార్యాలయాల్లో పనిచేస్తున్న సిబ్బంది అడ్డగోలుగా పట్టాలు పొందారు. మరికొందరైతే 'అధికారి మన మాట వింటున్నాడు.. మీకు పట్టా కావాలంటే ఇంత మొత్తం ఇచ్చుకుంటే చాలు మీ ఇంటికే పట్టా తెచ్చి ఇస్తా' మంటూ వసూళ్లు కూడా చేశారు.. చేస్తున్నారు. జిల్లా కేంద్రానికి సమీపంలో ఇళ్ల పట్టాలు ఇవ్వకూడదనే నిబంధన ఉన్నప్పటికీ అధికారులు నిబంధనలకు నీళ్లు వదిలేసారా లేక మామూళ్ల మత్తులో జోగుతున్నారా అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

పుట్టపర్తి జిల్లా కేంద్రం కావడంతో భూముల ధరలకు రెక్కలు వచ్చాయి. ఇదే అతనుగా భావించిన రెవెన్యూ కార్యాలయ సిబ్బంది తమ నైపుణ్యత'ను ప్రదర్శించి పప్పు బెల్లంలా తమ కుటుంబ సభ్యుల పేర్ల మీద బంధువుల పేర్ల మీద విలువైన భూములను అప్పనంగా కాజేశారు. గత నాలుగేళ్లుగా ఈ తంతు నడుస్తోంది. అయితే గతంలో ఎప్పుడో పట్టాలు పొందినట్లు రికార్డులను తారుమారు చేసి నకిలీ పట్టాలు పుట్టించారు. పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని ఎనుములపల్లి, పెద్ద కమ్మవారి పల్లి , ప్రశాంతి నిలయం, పుట్టపర్తి మండలం కప్పల బండ తదితర విలువైన గ్రామ పొలాల్లో రాత్రికి రాత్రే పట్టాలు సృష్టించేశారు. పుట్టపర్తి తహశీల్దార్ కార్యాలయంలో పనిచేసే ఓ ఆపరేటర్ కు 6 ఎకరాలు, కలెక్టరేట్ లో అటెండర్ గా పనిచేస్తున్న వ్యక్తి, ఆయన కుటుంబ సభ్యుల పేరు మీద కప్పలబండ గ్రామ పొలంలో 5 ఎకరాల భూమిని పట్టా చేయించుకున్నారు. పుట్టపర్తి తహశీల్దార్ కార్యాలయంలోని వీఆర్ఏలు పెడబల్లి, కప్పల బండ, ఎనములపల్లి గ్రామ సర్వే నెంబర్లలో వారి పేరు మీద, వారి బంధువుల పేర్లు మీద పదుల సంఖ్యలో ఎకరాలను పట్టాలు తెచ్చుకున్నారు. ఆర్డీవో కార్యాలయంలో అటెండర్ గా పనిచేస్తున్న ఓ వ్యక్తి ఆయన, ఆయన బంధువుల పేర్లు మీద అమకొండ పాలెం, ఎనుములపల్లి గ్రామ సర్వే నెంబర్లలో 9 ఎకరాలు పట్టా పొందారు. పెడబల్లి, కోట్లపల్లి, వెంగళమ్మ చెరువు, అమకొండ పాలెం సర్వే నెంబర్లలో గ్రామ రెవెన్యూ సహాయకులు పదుల సంఖ్యలో ఎకరాలను అడ్డగోలుగా పట్టాలు తెచ్చుకున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. నిరుపేదలకు జానెడు జాగా ఇవ్వాలంటే అనేక నిబంధనలు చూపించే అధికారులు వారి కార్యాలయాల్లో పని చేస్తున్న సిబ్బందికి అప్పనంగా వందల ఎకరాల భూములు ఎలా కట్టబెట్టారన్న ప్రశ్నలు ప్రజల్లో వినిపిస్తున్నాయి. అధికారి బదిలీ జరిగి నూతనంగా మరో అధికారి బాధ్యతలు చేపట్టిన ప్రతిసారి ఇలా కొత్త పట్టాలు పుట్టుకొస్తూనే ఉన్నాయి. సాక్షాత్తు కలెక్టరేట్లో పని చేస్తున్న సిబ్బంది కూడా ఇలా అడ్డగోలు పట్టాలు పొందుతున్న తీరుపై అనేక ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి అక్రమంగా వందల ఎకరాలు పట్టాలు పొందిన వాటి గురించి సమగ్ర విచారణ జరిపించి అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజాసంఘాల నాయకులు కోరుతున్నారు.

ఇంటి దొంగల పని పట్టండి



పుట్టపర్తి మండల వ్యాప్తంగా కుటుంబ సభ్యులు, బంధువుల పేర్ల మీద ఇలా అడ్డగోలుగా పట్టాలు పొందిన ఇంటి దొంగలపై రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలి. అధికారి బదిలీ అయిన ప్రతిసారి ఇలా కొత్త పట్టాలు పుట్టుకొస్తున్న తీరుపై సమగ్ర విచారణ జరిపించాలి. ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకుని అర్హులైన పేదలకు పంచిపెట్టాలి. ఉన్నతాధికారులు స్పందించకపోతే కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తాం.

ఈఎస్ వెంకటేష్,
సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు

టిడిపిలో బడుగులకు సముచిత స్థానం

'పురం' మార్కెట్‌యార్డ్ ఛైర్మన్ అశ్వర్థనారాయణరెడ్డి

ప్రజాశక్తి-హిందూపురం


బడుగు, బలహీన వర్గాల వారికి సముచిత న్యాయం టిడిపితోనే సాధ్యం అవుతుందని టిడిపి నాయకులు పేర్కొన్నారు. హిందూపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గ సభ్యులు గురువారం తమ బాధ్యతలను స్వీకరించారు. అధ్యక్షులుగా మణేసముద్రం అశ్వర్థ నారాయణరెడ్డి బాధ్యతలు చేపట్టారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన మునిసిపల్ చైర్మన్ రమేష్, టిడిపి జిల్లా అధ్యక్షులు కొల్ల అంజినప్ప, టిడిపి పొలిటికల్ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, ఎమ్మెల్యే బాలకృష్ణ సహాయ కార్యదర్శులు వీరయ్య, బాలాజీ స్థానిక టిడిపి నాయకులు పాల్గొన్నారు. అందరి సమక్షంలో అశ్వర్థ నారాయణ రెడ్డి చైర్మన్‌గా బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతు హిందూపురం వ్యవసాయ మార్కెట్ యార్డ్ అంటే రాయలసీమలో ఎంతో పేరుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ బేవిన హళ్లి ఆనంద్, మాజీ మున్సిపల్ చైర్మన్ జె.వి అనిల్ కుమార్, సీనియర్ నాయకులు గ్రీన్ పార్క్ నాగరాజు, పూలుకుంట సర్పంచ్ మంజునాథ్, మున్సిపల్ కౌన్సిలర్ సతీష్ కుమార్, టిడిపి నాయకులు సుమోసిన, దుర్గా నవీన్, టిడిపి లీగల్ సెల్ న్యాయవాది శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.



మార్కెట్ యార్డు చైర్మన్‌ను సన్మానిస్తున్న దృశ్యం

మార్కెట్ యార్డ్ కమిటీలో జనసేన శ్రీనివాసులు

చిలమత్తూరు : హిందూపురంలో జరిగిన వ్యవసాయ మార్కెట్ యార్డ్ కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో నూతన చైర్మన్‌గా అశ్వర్థనారాయణ రెడ్డి ప్రమాణం చేశారు. ఈ కమిటీలో జనసేన పార్టీ తరపున డైరెక్టర్‌గా అగ్గి శ్రీనివాసులు, ఇతర సభ్యులతో కలిసి బాధ్యతలు చేపట్టారు. తనకు ఈ అవకాశాన్ని కల్పించిన జనసేన పార్టీకి, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ, హిందూపురం జనసేన ఇంచార్జి ఆకుల ఉమేష్‌కు అగ్గి శ్రీనివాసులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా కార్యదర్శి ఏవి రమణ, జనసేన మండల కన్వీనర్ చిన్న ప్రవీణ్, లక్ష్మణమూర్తి, అంజి తదితరులు పాల్గొన్నారు.



మార్కెట్‌యార్డ్ డైరెక్టర్ అగ్గి శ్రీనివాసులును సన్మానిస్తున్న నాయకులు

ప్రతిభా విద్యార్థులకు పురస్కారాలు

ప్రజాశక్తి-పెనుకొండ

పదవ తరగతిలో ఉత్తమ ప్రతిభ కనపరిచిన 50 మంది విద్యార్థిని విద్యార్థులకు పూలే అంబేద్కర్ ప్రతిభ పురస్కారాలను గురువారం అందజేశారు. బహుజన చైతన్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు హైకోర్టు న్యాయవాది శివరామకృష్ణ జన్మదిన వేడుకల సందర్భంగా మండలంలోని గుట్టూరులోని ఆయన స్వగృహంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం బహుజన చైతన్య వేదిక సభ్యులు పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రిలో రక్తదాన శిబిరం ఏర్పాటు 23 మంది రక్త దానం చేశారు. అదేవిధంగా ప్రభుత్వ ఆసుపత్రి లో రోగులకు బ్రెడ్లు పండ్లు పంపిణీ చేశారు. 500 పైగా మార్కులు సాధించిన విద్యార్థులకు కప్పి మెమెంటోలం అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాజగోపాల్, కొల్లాయప్ప, ఉమ్మర్ ఫారూఖ్ , బహుజన చైతన్య వేడుక బందం, రవి, బాబు, నాగార్జున, ఆనంద్, మాజీ మార్కెట్ యార్డ్ డైరెక్టర్ ఈశ్వర్, సూరి, మాజీ ఎంపీటీసీ కిష్టప్ప,ఆంద్రూస్, క్రిస్టఫర్ తదితరులు పాల్గొన్నారు.



ప్రతిభా విద్యార్థులతో న్యాయవాది శివరామకృష్ణ, తదితరులు

తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం

ప్రజాశక్తి - గోరంట్ల

తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం సమకూర్చుకోవచ్చని శాస్త్రవేత్తలు మంజునాథ, మాధవి తెలిపారు. మండలంలో వానవోలు ,వనవోలు తండా గ్రామాలలో రైతు సేవాకేంద్రాల వద్ద వికసిత్ కృషి సంకల్ప అభియాన్" కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రైతులు ,నాయకులు, రైతు సేవ కేంద్రం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

రక్తపోటుపై అవగాహన

ప్రజాశక్తి - రొద్దం

ప్రపంచ రక్తపోటు దినోత్సవం సందర్భంగా గురువారం మండలంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యాధికారి డాక్టర్ సి ఎస్ సోమశేఖర్ రక్తపోటు, దాని పర్యావసనాలపై అవగాహణ కల్పించారు. అధిక రక్తపోటు వల్ల కలిగే ప్రమాదాల గురించి వివరించారు. 40 సంవత్సరములు దాటిన తర్వాత ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా నెలకు ఒకసారి బిపి చెక్ చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది హెల్త్ అండ్ వెల్నెస్ సిబ్బంది ఎఎన్ఎం తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ఆక్రమణదారులకు నోటీసులు

ప్రజాశక్తి - కొత్తచెరువు

కొత్తచెరువులో నాలుగు రోడ్లకు ఇరువైపులా స్థలాలను ఆక్రమించుకున్న వారిని గుర్తించడం జరిగిందని రెండు రోజుల లోపల వారికి నోటీసులు జారీ చేస్తామని ఆర్అండ్‌బి జేఈ వన్నూరు స్వామి తెలిపారు. నాలుగు రోడ్లకు ఇరువైపులా స్థలాలు ఆక్రమించుకున్న 120 మందిని గుర్తించడం జరిగిందన్నారు. ఇప్పటికే రెవెన్యూ అధికారులు మార్కింగ్ లు వేసి తమకు నివేదికలను అందజేశారన్నారు. జిల్లా కలెక్టర్ చేతన్ ఆదేశాల మేరకు నోటీసులు ఇచ్చిన వారు వారం రోజుల లోపల స్వచ్ఛందంగా ఆక్రమణలను తొలగించుకోవాలన్నారు. అలా తొలగించుకోకపోతే తామే తొలిగించడం జరుగుతుందన్నారు.

యోగాతో ఆరోగ్యం

ప్రజాశక్తి - గాండ్లపెంట

యోగాతో ఆరోగ్యంగా ఉంటామని ఎంఇఒలు కృష్ణనాయక్, శ్రీనివాసులు అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం యోగాంధ్ర కార్యక్రమం లో భాగంగా ఎంఇఒ, ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎంఇఒలు మాట్లాడుతూ జూన్ 21వ తేదీ యోగ డే దినోత్సవం ప్రతి ప్రభుత్వ పాఠశాలలోనూ యోగ కార్యక్రమాలు నిర్వహించి యోగాపై అవగాహన సదస్సులు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ప్రసాద్, మంజుల, పామిడి ముంతాజ్ అలీ, ఉపాధ్యాయులు రాజశేఖర్, రామ్మోహన్, ఉపాధ్యాయులు, ఎంఆర్‌సి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

నిరుద్యోగులకు అవగాహన

ప్రజాశక్తి-సోమందేపల్లి

మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో మండల అభివద్ధి అధికారి వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో నిరుద్యోగులకు హార్టికల్చర్, అగ్రికల్చర్, ఫిషినరీ, సీడ్ ఏపీ సొసైటీ అధికారులచే ఉద్యోగ కల్పనలో భాగంగా వివిధ రకాల కోర్సుల యందు శిక్షణ కొరకు గురువారం అవగాహన కల్పించారు. అనంతరం చల్లపల్లిలో అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవ సందర్భంగా నాగులూర్ రోడ్డుకు ఇరువైపులా చెట్లను నాటారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం కన్వీనర్ వెంకటేష్, మాజీ జెడ్పిటిసి వెంకటరమణ, డి వీ ఆంజనేయులు, సిద్ద లింగప్ప, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

యోగాంధ్ర పోస్టర్లు విడుదల

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా ఆదర్శ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆర్డీవో మహేష్ చేతులమీదుగా యోగాసనాల ముద్ర కాల పోస్టర్లను గురువారం విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరి పైన ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆదర్శ సేవా సంఘం అధ్యక్షులు భీమిశెట్టి కృష్ణమూర్తి, గౌరవాధ్యక్షులు సూర్య ప్రకాష్, కార్యదర్శి గుద్దిట్టి నాగార్జున, సూర్య నాగరాజు, నాగసముద్రం నాగభూషణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరాకు చర్యలు

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

డివిజన్లో ఇకనుంచి అంతరాయం లేకుండా సక్రమమైన విద్యుత్తును అందిస్తామని విద్యుత్ శాఖ సిజిఎం వరకుమార్ తెలిపారు. గురువారం ధర్మవరం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ధర్మవరం డివిజన్ నుండి అనేక ఫిర్యాదు రావడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తాను విచారణ నిమిత్తం ఇక్కడకు వచ్చినట్లు చెప్పారు. సబ్ డివిజన్లోని సబ్ స్టేషన్లను, వివిధ విద్యుత్ కార్యాలయాలను తనిఖీ చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో డివిజన్ విద్యుత్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధాశ్రమం ప్రారంభం

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

మునిసిపాలిటీ పరిధిలోని ప్రశాంతి గ్రామ్ సమీపంలో ఓం శాంతి కాలనీలో మంజుల ఉమెన్ వెల్ఫేర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వృద్ధాశ్రమాన్ని గురువారం ప్రారంభించారు. ఆ ట్రస్ట్ చైర్మన్ మంజుల సభ్యులు శ్రావణ్ కుమార్, సంపంగి అనిత, తదితరులు వృద్ధాశ్రమాన్నిప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదరణ కోల్పోయిన నిరుపేదలైన వృద్ధుల కోసం, తల్లి తండ్రి లేని దిక్కు ముక్కు లేని పిల్లలను సైతం ఈ ఆశ్రమంలో వసతి కల్పిస్తామన్నారు. ఇక్కడ అన్ని సదుపాయాలతో వసతి భోజనం కల్పించడం జరుగుతుందన్నారు. అలాంటి వారు దరఖాస్తు చేసుకున్న తరువాత ట్రస్ట్ సభ్యులు వారు తెలిపిన వివరాల మేరకు పరిశీలించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఓంశాంతి ప్రతినిధులు, ఇస్కాన్ టెంపుల్ ప్రతినిధులు, ట్రస్టు ప్రచార కార్యదర్శి సంపంగి గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

ఇంధన ప్రాజెక్టు స్థాపనకు భూ సేకరణ చేపట్టండి

కలెక్టర్ టిఎస్. చేతన్

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

జిల్లాలో ఇంధన ప్రాజెక్టు స్థాపనకు అవసరమైన భూ సేకరణ కార్యక్రమం చేపట్టాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్లో ప్రాజెక్టు స్థాపన విషయమై అధికారులతో సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ డిఆర్ఒ సూర్యనారాయణ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రెన్యువబుల్ ఎనర్జీ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఏపీ లిమిటెడ్ వారి ఆధ్వర్యంలో జిల్లాలో కొన్ని వేల మెగావాట్ల పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టు స్థాపనకు అవసరమైన భూమిని సేకరించవలసి ఉందన్నారు. సంబంధిత ఆర్‌డిఒలు, తహశీల్దార్లు ఈ విషయంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఆయా మండలాల్లో ప్రభుత్వ భూమి ఎంత ఉందో చూసుకోవాలన్నారు. అంతేకాకుండా ఇంధన ప్రాజెక్టు స్థాపనకు భూమిని లీజుకు ఇచ్చే పట్టా ఉన్న రైతులు వివరాలను సేకరించాలన్నారు. అలాంటి రైతులు ఎకరాకు సంవత్సరానికి 31 వేల రూపాయలు ప్రభుత్వం అందజేస్తుందని తెలిపారు. అటువంటి రైతుల నుంచి భూ సేకరణ కార్యక్రమం కొరకు గ్రామ సభలు నిర్వహించాలన్నారు. భూములు ఇవ్వటానికి సిద్ధంగా ఉన్న రైతుల జాబితా సిద్ధం చేయాలని తెలిపారు. భూములను బ్లాక్ చేసి ఉంచాలని చెప్పారు. అంతేకాకుండా భూములకు సంబంధించిన మ్యాపులు సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పుట్టపర్తి, ధర్మవరం, పెనుకొండ ఆర్డీవోలు సువర్ణ, మహేష్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని పాఠశాలలపై చర్యలు తీసుకోండి

ప్రజాశక్తి-హిందూపురం



ఎంఇఒకు వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

పట్టణం, మండల వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రవేటు పాఠశాలల్లో టిసిలు ఇవ్వడానికి డబ్బులను వసూలు చేస్తున్నారని, అలాంటి పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ పట్టణ కన్వీనర్ ఆఫ్రిద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంఇఒ గంగప్పకు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రవేటు విద్యా సంస్థల్లో ఫీజులను చెల్లించడానికే విద్యార్థుల తల్లిదండ్రులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. చివరకు టిసిలను ఇవ్వడానికి సైతం డబ్బులు వసూలు చేస్తున్నారన్నారు. ఇదే విధంగానే ప్రభుత్వ పాఠశాలల్లో పాఠశాల అభివృద్ధి పేరుతో టిసిలను ఇవ్వడానికి పాఠశాల హెచ్ఎంలు భారీగా వసూళ్లకు పాల్పడుతున్నారన్నారు. ఈ ఘటనపై విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్పందించిన ఎంఇఒ మాట్లాడుతు వెంటనే పాఠశాల హెచ్ఎంలతో సమావేశం ఏర్పాటు చేసి, టిసిలకు డబ్బులు వసూలు చేయాకూడదని ఆదేశాలిస్తామన్నారు. అప్పటికి డబ్బులను వసూలు చేస్తే వారిపై శాఖ పరమైన చర్యలను తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు ఆఫ్రిద్, ఉమేష్, రాధిక్, కౌశిక్ తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం : ఎమ్మెల్యే



డ్రయినేజీ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి - మడకశిర

నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నామని స్థానిక ఎమ్మెల్యే ఎంఎస్. రాజు పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని 13, 14 వార్డుల్లో టీ టైమ్ విత్ ఎంఎస్ఆర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల వద్దకు ఎమ్మెల్యే వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పట్టణ ప్రజలు తాము ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యేకు దృష్టికి తీసుకువెళ్లారు. ఓ వద్ధురాలు ఎమ్మెల్యే వద్దకు వచ్చి అయ్యా. ప్రభుత్వ ఆసుపత్రి వెనుకభాగంలో ఉంటున్న తమ ఇంటికి దారిలేక నానా అవస్థలు పడుతున్నానని విన్నవించింది. దీంతో ఎమ్మెల్యే తక్షణమే స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజల ఇళ్లల్లో నుండి మురుగునీరు రోడ్లమీదకు రావడాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులను పిలిపించి డ్రయినేజీ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పారిశుధ్య నిర్వహణ విషయంలో మున్సిపల్ సిబ్బందికి ప్రజలు కూడా సహకరించాలని ప్రజలను కోరారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిని ఎమ్మెల్యే తనిఖీ చేశారు. ఆసుపత్రిలో అందుతున్న సదుపాయాలపై ఆరా తీశారు. తాను పర్యటించే ప్రాంతంలో చిన్న పిల్లలు బొంగరం ఆట ఆడటాన్ని గమనించే ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు పిల్లల వద్దకు వెళ్లి వారితో సరదాగా ముచ్చటించారు. వారి చదువు వివరాలు అడిగి తెలుసుకున్నారు. వారితో సరదాగా కాసేపు బొంగరాల ఆట ఆడారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు రాజు, సుభద్ర నాగేంద్ర, ఉమా శంకర్, తెలుగు యువత తాలూకా అధ్యక్షుడు బాలకష్ణ, నాయకులు అధికారులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత : సమాజంలో పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు తెలిపారు . ప్రపంచ పర్యావరణ దినోత్సవం , వన మహోత్సవం సందర్భంగా ఎమ్మెల్యే ఎమ్ ఎస్ రాజు గురువారం అధికారులతో కలిసి ప్రతిజ్ఞ చేసారు. పర్యవరణ దినోత్సవం సందర్భంగా చెట్లు నాటారు. ఈ కార్యక్రమములో రాష్ట్ర కుంచితిగా వక్కలిగ సాధికర సమితి కన్వీనర్ వి ఎం పాండురంగప్ప మండల కన్వీయర్ దాసిరెడ్డి , లక్ష్మీనారాయణ, కౌన్సిలర్లు రాజు, సుభద్ర నాగేంద్ర, విక్రమ్, ఉమా శంకర్, ఈశ్వర్, వైజాగ్ రమేష్, తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి మారుతి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.







పెనుకొండ ఎలిమెంటరీ టీచర్స్

కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్ష, కార్యదర్శుల ఎన్నిక

ప్రజాశక్తి-పెనుకొండ

పెనుకొండ ఎలిమెంటరీ టీచర్స్ కోఆపరేటివ్ టీచర్స్ సొసైటీ ఎన్నికలలో ఎపిటిఎఫ్ ప్యానెల్ సభ్యులు ఏడుగురు ఎన్నికైయ్యారు. గురువారం ఎన్నికల అబ్జర్వర్ వన్నూరుస్వామి ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సమావేశం నిర్వహించారు. సొసైటీ గౌరవఅధ్యక్షులు, అధ్యక్షులు,కార్యదర్శులను ఈ సందర్భంగా ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు . గౌరవ అధ్యక్షుడిగా సి. అమీర్ వలి, అధ్యక్షులుగా వై.రాజశేఖర్, కార్యదర్శిగా జవ్వాజి నాగరాజు ఎన్నుకున్నారు. కొత్తగా ఎన్నికైన కార్యవర్గం సంస్థ అభివృద్ధికి, పాత బకాయిలు వసూలుకు కృషి చేస్తామని చెప్పింది. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కోనంకి అశోక్ కుమార్, శ్రీ సత్యసాయి జిల్లా అధ్యక్షులు కోడూరు శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్ర, సొసైటీ డైరెక్టర్లు క్రిష్ణానాయక్, రమేష్ బాబు, వెంకటరమణ నాయక్,రంగేష్ కుమార్, కె.మల్లికార్జున , కె.రఘునాథరావు, యం. శ్రీనివాసులు , చంద్రమౌళి , సంజీవరాయుడు, లక్ష్మ నాయక్ , గోకుల్, గంగప్ప తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్యనందించండి

కలెక్టర్‌కు ఎపి డబ్ల్యూజెఎఫ్ వినతి

ప్రజాశక్తి - కొత్తచెరువు

జర్నలిస్ట్ పిల్లలందరికీ వంద శాతం ఉచిత విద్య అందే విధంగా చర్యలు తీసుకోవాలని ఏపీడబ్ల్యూజేఎఫ్ నాయకులు కోరారు. ఈ మేరకు వారు కలెక్టర్ టీఎస్ చేతన్ ను కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా నాయకులు పి. శ్రీనివాసులు, బసయ్య మాట్లాడుతూ జర్నలిస్ట్ పిల్లలందరికీ అన్ని ప్రైవేటు పాఠశాలలు కళాశాలలో 100 శాతం ఉచిత విద్య అందించాలని కలెక్టర్‌ని కోరామన్నారు. కరువు జిల్లా అయినందున జర్నలిస్టులు ఫీజులు కట్టలేని పరిస్థితిలో ఉన్నారని పూర్తిగా వారి పిల్లలందరికీ ఉచిత విద్య అందించి సహకరించాలని కోరమన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్పందిస్తూ తప్పకుండా తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీడబ్ల్యూజేఎఫ్ నాయకులు నాగార్జున, శ్రీరాములు, సాయి ప్రసాద్, రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎపిడబ్ల్యూజెఎఫ్ నాయకులు

ముగిసిన వేసవి శిక్షణ

ప్రజాశక్తి -ధర్మవరం రూరల్

ధర్మవరం పట్టణంలోని బాబు జగ్జీవన్ రామ్ నగర్‌లోని గ్రంథాలయంలో 33 రోజులుగా నిర్వహిస్తున్న వేసవి శిక్షణా తరగతులు గురువారం ముగిసాయి. ఈ సందర్భంగా వివిధ అంశాలలో శిక్షణ పొందిన విద్యార్థులకు పలు పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను పంపిణీ చేసినట్లు గ్రంథాలయ అధికారిని ఆంజనేయ సౌభాగ్యవతి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఓబయ్య, మేనేజర్ సుకుమార్, రంగనాథ్, మేడ రవి, టీచర్ ముత్యాలప్ప, మురళి,ఎల్ఐసి నాగరాజు, గ్రంథాలయ సిబ్బంది రమణా నాయక్, శివమ్మ, పాఠకులు పాల్గొన్నారు.

తాడిమర్రి : మండలంలోని గ్రాంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరం గురువారం ముగిసింది. గ్రాంధాలయాధికారి శీనా నాయక్ అధ్వర్యం లో ఏర్పాటు చేసిన వేసవి విజ్ఞాన శిబిరం ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వెటర్నరీ డాక్టర్ స్వర్ణలత, ఆర్డీటీ టీచర్ రామకృష్ణ హాజరయ్యారు. అనంతరం నిర్వహించిన చిత్రలేఖనం, వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు.

చిలమత్తూరు : చిలమత్తూరు శాఖా గ్రంథాలయంలో 45 రోజుల పాటు నిర్వహించిన వేసవి శిక్షణా తరగతుల ముగింపు కార్యక్రమం గురువారం ఘనంగా జరిగింది. గ్రంథాలయాధికారి ఆర్. మల్లికార్జున ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలో కె.అతావుల్లా, డ్రాయింగ్ మాస్టర్ వేణుగోపాల్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.

హిందూపురం : ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు సృజనాత్మకతను పెంపొందించుకోవాలని మున్సిపల్ చైర్మన్ డిఈ రమేష్ కుమార్ పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని ధర్మపురం గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణా శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. విజ్ఞానం ద్వారానే విద్యార్థులకు సమాజంలో ప్రత్యేక గుర్తింపు లభిస్తుందన్నారు. అనంతరం పోటీల్లో విజేతగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందించారు.ఈ కార్యక్రమంలో ఎంఇఒ గంగప్ప, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ మెంబర్లు కల్లూరు రాఘవేంద్ర, ఉమర్ ఫరూక్, ఎమ్.జి. గంగాధర్, ఉపాధ్యాయులు శ్రీశైలం, అఫ్జల్ బాషా తదితరులు పాల్గొన్నారు.

టిడిపి మండల, పట్టణ కన్వీనర్ల నియామకం

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం నియోజక వర్గంలో పట్టణంతో పాటు మండల కన్వీనర్లను గురువారం టిడిపి పొలిటికల్ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు ప్రకటించారు. ఎమ్మెల్యే బాలకృష్ణ ఆదేశాల మేరకు పట్టణ టిడిపి కన్వీనర్‌గా ఎం వెంకటేశులు, కోఆర్డినేటర్ గా కౌన్సిలర్ రాఘవేంద్ర, రూరల్ కన్వీనర్‌గా హెచ్ ఎన్ రాము, కోఆర్డినేటర్ గా పూలకుంట సర్పంచి మంజునాథ్, లేపాక్షి మండల్ కన్వీనర్‌గా అభి, కోఆర్డినేటర్ గా ఈ. జయప్ప, చిలమత్తూరు మండల కన్వీనర్ గా శ్రీనివాసులు, కోఆర్డినేటర్ గా రంగారెడ్డిని నియమించినట్లు వివరించారు. పార్టీకి చేసిన సేవలను గుర్తించి తమను కన్వీనర్లుగా నియమించడం చాలా సంతోషమని, ఇందుకు సహాయ, సహకారాలు అందించిన ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణకు నూతన కన్వీనర్లు కృతజ్ఞతలు తెలిపారు, నూతనంగా ఎంపికైన టిడిపి కన్వీనర్లకు పార్టీ జిల్లా అధ్యక్షులు అంజినప్ప, మున్సిపల్ ఛైర్మన్ రమేష్ కుమార్, మాజీ ఛైర్మన్ అనీల్ కుమార్, నాయకులు కార్యకర్తలు ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కురుబ కార్పోరేషన్ డైరెక్టర్ పరిమళ, రామాంజినమ్మ, శ్రీదేవి, అమర్నాథ్, వెంకటేష్, రాము తదితరులు పాల్గొన్నారు

ఆత్మరక్షణకు కరాటే అవసరం

ప్రజాశక్తి-హిందూపురం

ఆత్మరక్షణకు కరాటే ఎంతో దోహదపడుతుందని కరాటే శిక్షకులు అల్తాఫ్ పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని ఇందిరా పార్కులో ఏ.యస్.గోజుర్యూ కరాటే శిక్షణ కేంద్ర నిర్వాహకులు సెన్సేయి ఫైరోజ్ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన విద్యార్థులకు కరాటే పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కరాటేను అభ్యసనం చేయడం వల్ల ఆత్మ రక్షణతో పాటు శారీరక, మానసిక ఉల్లాసానికి ఎంతో దోహదపడుతుందన్నారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను కరాటే పట్ల అవగాహన పెంచుకోనేలా సూచనలు ఇవ్వాలన్నారు. ఆయా కరాటే విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెడల్స్, ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్లు ఉసామా, హేమంత్, చరణ్, నేహా తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

హిందూపురం : రాజకీయ పార్టీలకు అతీతంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడమే ధ్యేయంగా ముందుకు వెళుతున్నట్లు మున్సిపల్ చైర్మన్ డిఈ రమేష్ కుమార్, ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి వీరయ్య, మున్సిపల్ కమిషనర్ సంఘం శ్రీనివాసులు పేర్కొన్నారు. వార్డు పర్యటనలో భాగంగా గురువారం సత్యనారాయణపేటలో పర్యటించారు. సమస్యలను సెక్రెటరీల దృష్టికి తీసుకెళ్లిన వాటిని పరిష్కరించడం లేదని ప్రజలు ఫిర్యాదు చేయడంతో వారు సెక్రెటరీలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త శ్రీనివాసరావు, ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి బాలాజీ, కౌన్సిలర్ ఆయూబ్, రాఘవేంద్ర, రాష్ట్ర కురుబ కార్పోరేషన్ డైరెక్టర్ పరిమళ, టీడీపీ నాయకులు ఆరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత సమాజాన్ని స్థాపిద్దాం



పుట్టపర్తిలో వైద్యఆరోగ్య శాఖ అధ్వర్యంలో ర్యాలీ



పెనుకొండలో న్యాయసేవాధికార సంస్థ అధ్వర్యంలో ర్యాలీ

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

ప్లాస్టిక్ రహిత సమాజాన్ని స్థాపించి పర్యావరణాన్ని కాపాడాలని శ్రీ సత్య సాయి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని ఫిరోజా బేగం పేర్కొన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా జిల్లా వైద్యశాఖ కార్యాలయం నుంచి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారిని డాక్టర్ ఫైరోజా బేగం మాట్లాడుతూ ప్లాస్టిర్ వల్ల కలిగే అనర్థాలను వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారిని సమత, జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్, డిప్యూటి డి ఎం అండ్ హెచ్, ఎపిడెమీయోలాజిస్టు తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం : పర్యావరణ పరిరక్షణ కోసం సమైక్యంగా కృషి చేద్దామనిమున్సిపల్ చైర్మన్ డిఈ రమేష్ కుమార్, ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి వీరయ్య, మున్సిపల్ కమిషనర్ సంఘం శ్రీనివాసులు పిలుపు నిచ్చారు. గురువారం అంతర్జాతీయ పర్యావరణ పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలోని ఆటో నగర్ బైపాస్ రోడ్డు నందు ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవం, స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్రలో భాగంగా 400 మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు సునీత, అంజలి రెడ్డి, టీడీపీ నాయకులు వెంకటేష్ రెడ్డి, కిరోసిన్ బాబు, కూటమి నాయకులు రవితేజ, ఇంచార్జి ఎంఈ దస్తగిరి, ఎమ్.హెచ్.ఓ. శోభన్ రెడ్డి, ఏ.ఈ. జనార్ధన్, శానిటేషన్ ఇన్స్ పెక్టర్లు శంకర్, నిజాముద్దీన్, టి.ఎమ్.సి. గంగులయ్య, మెప్మా సిబ్బంది సీ.ఓ.లు, ఆర్పీ లు పాల్గొన్నారు. ఎస్. డి. జి. ఎస్ కళాశాలలో ఎన్. సి. సి, ఎన్. ఎస్. ఎస్ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. అదే విధంగా రూరల్ మండల పరదిలోని కిరికేర పంచాయితీ పరదిలో బ్లాక్ ప్లాంటేషన్ కింద 50 మొక్కలను నాటారు. మండల పరిధిలో వివిధ గ్రామాల్లో 520 మొక్కలను నాటారు.

సోమందేపల్లి : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మండల వైద్యులు డాక్టర్ ఓంకార్, డాక్టర్ అయోష తస్నిమ్ ఆధ్వర్యంలో గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చెట్టు నాటుదాం, పచ్చదనాన్ని పెంచడం పర్యావరణ కాపాడుదాం కాలుష్యాన్ని నిర్మూలిద్దాం అనే నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర ఆవరణంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఒ మనోహర్ రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ మధుబాబు, పర్యవేక్షకులు రవీంద్రా, రత్నమ్మ, ల్యాబ్ టెక్నీషియన్ అనిల్, ఆరోగ్య కార్యకర్తలు షాజహాన్, చంద్రశేఖర్ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, ఏఎన్ఎం లు శారద, గంగమ్మ ,లక్ష్మీదేవి చందు బాయ్, తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ : మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షిద్దామనితహశీల్దార్ శ్రీధర్ అన్నారు. గురువారం పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం ఆవరణలో ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ.. వనం మనం కార్యక్రమాన్ని ప్రభుత్వ కార్యక్రమంలా కాకుండా సొంత కార్యక్రమంగా జరుపుకోవాలని అన్నారు. ప్రజలందరూ ప్లాస్టిక్ రహిత వస్తువులు వినియోగించాలన్నారు.ఈకార్యక్రమంలో సిఎస్‌డిటి ప్రభావతి, ఆర్ఐ భాస్కర్ రెడ్డి, వీఆర్వో తేజ, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపాలిటీ ఆధ్వర్యంలో... ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పట్టణ పరిధిలోని జాతీయ రహదారి పక్కన చెట్లను నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సతీష్ కుమార్ పట్టణ పార్టీ కన్వీనర్ శ్రీరాములు యాదవ్ మాజీ సర్పంచి అశ్వర్థ నారాయణ, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గోరంట్ల : పట్టణంలో శ్రీ కష్ణ దేవరాయ జూనియర్ కళాశాల, ఎస్‌పివిఎం డిగ్రీ కళాశాలల్లో పర్యావరణ దినోత్సవం సందర్భంగా కళాశాలల ప్రిన్సిపల్స్ భక్తవత్సలం విజయలక్ష్మి, ఎన్ఎస్ఎస్ పిఒ తదితరులు కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు అరవింద్, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

మడకశిర : సమాజంలో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడానికి కృషి చేయాలని స్థానిక డిపో మేనేజర్ రంగ భాష్పం తెలిపారు. స్థానిక డిపో మేనేజర్ రంగ భాష్పం ఆధ్వర్యంలో గురువారం ఆర్టీసీ డిపో ఆవరణంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్‌ఛార్జి బ్రహ్మానంద రెడ్డి, గ్యారేజ్ ఇంచార్జ్ ధనుంజయ, ఉలిగమ్మ మేడం , ఎంప్లాయిస్ యూనియన్ డిపో అధ్యక్షులు జి. ఎండీ. రఫీక్, ఎస్‌బిఐ, గ్యారేజ్ మెకానికులు, గ్యారేజ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గాండ్లపెంట : ప్రపంచ పర్యావరణ దినోత్సవం లో భాగంగా గురువారం మండల కేంద్రంలోని గ్రామ సచివాలయం, సోమయాజులపల్లి సచివాలయం పరిసర ప్రాంతాలలో చెట్లు నాటారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటరామిరెడ్డి, తహశీల్దార్ బి బాబురావు, ఇఒఆర్‌డి సునీత, ఎంపీపీ సోమశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ : పర్యావరణాన్ని కాపాడండి.. భావితరాలకు బాసటనివ్వండి అని సీనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవా అధికార సంస్థ చైర్మన్ టి.వాసుదేవన్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా మొక్కలు నాటే కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భవిష్యత్తు తరాలకు ప్లాస్టర్ రహిత సమాజాన్ని అందించాలన్నారు. పర్యావరణ కాలుష్యం లేకుండా ఉండే వస్తువులను వినియోగించాలని సూచించారు. విద్యార్థులతో కలిసి తెలుగు తల్లి వి గ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యం. బొజ్జప్ప, బార్ ప్రెసిడెంట్ మదుసూదనరెడ్డి, వి. శ్రీనివాసులు, అడ్వకేట్లు నాగరాజు, నాగిరెడ్డి, కోర్టు సిబ్బంది ఉగ్రప్ప, చంద్రకళ, గోపీకష్ణ, లెక్చరర్లు గవర్నమెంట్ జూనియర్ కాలేజ్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అగళి : పర్యావరణ దినోత్సవం సందర్భంగా మండలంలోని అక్కడ దేవరపల్లిలో ఏపీవో మంజునాథ్, సిబ్బందితో కలిసి మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొక్కలు నాటడం ద్వారా పర్యావరణ కాలుష్యాన్ని కాపాడవచ్చునని అన్నారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం రూరల్ : మొక్కలు విరివిగా చెట్లను నాటి పర్యావరణాన్ని పరిరక్షిద్దామని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన ప్రపంచ పర్యావరణ దినోత్సవం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఎంపీడీవో, ఇతర అధికారులు, సిబ్బంది, టీడీపీ నాయకులతో కలిసి ఆయన మొక్కలు నాటారు. అనంతరం మండలంలోని ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లతో శ్రీరామ్ సమావేశమయ్యారు. ఇటీవల జరిగిన పనులు.. కొన్ని ఫిర్యాదులపై చర్చించారు. ఉపాధి హామీ ద్వారా ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలు చేపడుతోందని.. వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నా.. కూలీలకు పని కల్పించాలన్నా ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్ల పాత్ర చాలా కీలకంగా ఉంటుందన్నారు.

చిలమత్తూరు : పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల పరిధిలోని కోడూరు పంచాయతీలో గురువారం మొక్కలు నాటారు. సర్పంచి మురళి, పంచాయతీ సెక్రటరీ భాస్కర్, పోలీస్ సిబ్బంది కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుళ్లు పోతలయ్య, విజయ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పావగడ : ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని సీనియర్ సివిల్ జడ్జి వి.మాదేష్ తెలిపారు. పట్టణంలోని కోర్టు ఆవరణంలో తాలూకా న్యాయ సేవా కమిటీ, బార్ అసోసియేషన్, అటవీశాఖ సంయుక్తంగా నిర్వహించిన ప్రపంచ పర్యావరణ దినోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అటవీశాఖ రైతులకు మొక్కలు నాటేందుకు ప్రోత్సాహదనం ఇస్తున్నా పూర్తిస్థాయిలో అమలు కావడం లేదన్నారు. చెట్లను రక్షించడం, పెంచడం అందరి కర్తవ్యమని అన్నారు.ఈ కార్యక్రమంలో మండల అటవీ అధికారి రాకేశ్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శేషా నందన్, సివిల్ జడ్జి బి. ప్రియాంక, అదనపు సివిల్ జడ్జి ,సి.మునిరత్నమ్మ, బార్ అసోసియేషన్ కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి, ప్రభుత్వ సహాయ న్యాయవాది సన్నీరప్ప, అటవీ అధికారి రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.